## గన్నేరు పప్పు తిని తల్లీకొడుకు ఆత్మహత్య



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీకి చెందిన మీనాక్షి కుమారుడు రవి తరచూ గొడవ పడుతుండే వాళ్లని గొడవల కారణంగా ఇద్దరు గన్నేరు పప్పు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం నాడు రాత్రి రవి మద్యం సేవించి రావడంతో తల్లి మీనాక్షితో గొడవ పడి తరచూ గొడవలు జరుగుతున్నాయని చుట్టుపక్కల వారితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నావని వారందరూ తమపై నిందలు వేస్తున్నారని తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన తల్లి కొడుకులు గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకున్నారు. రవి రాత్రి మృతి చెందగా తల్లి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు జడ్చర్ల పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు వివరించారు.

## పిడుగుపాటుకు ఆవు మృతి



**ప్రజాపక్షం/వంగూర్ :** పిడుగు పాటుకు గురై ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నిజాంబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం గురువారం రాత్రి అకాల వర్షానికి ఉరుముల మెరుపులతో పిడుగు పడడంతో గ్రామానికి చెందిన ఈడమోని బక్కయ్య వ్యవసాయ పొలంలో పాడి ఆవు కట్టేసి ఉండగా ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కారు బైక్ ఢీ : పంచాయతీ కార్యదర్శి మృతి



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కారు అతివేగంతో బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెళుతున్న పంచాయితీ కార్యదర్శి పవన్ కుమార్ మృతి చెందిన సంఘటన మండలంలోని కల్వకోల్ గ్రామ శివారులో శుక్రవారం నెలకొంది. స్థానికులు, ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం కొల్లాపూర్ మండలం రాంపురం గ్రామపంచాయితీ కార్యదర్శి పవన్ కుమార్ తన స్వగ్రామం ఎన్మన్ బెట్ల నుండి నాగర్ కర్నూల్ జరిగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి బైక్‌పై వెళుతుండగా కల్వకోల్ చెన్నప్ప రావుపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి వస్తున్న కారు అతివేగంగా బైక్‌ను ఢీకొట్టడంతో పంచాయితీ కార్యదర్శి పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఎస్ఐ సతీష్ తెలిపారు. కారును పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతి చెందిన పంచాయితీ కార్యదర్శికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## నవజాత శిశువుకు ప్రాణం పోసిన 108 సిబ్బంది

### అభినందించిన జిల్లా మేనేజర్ సునీల్ కుమార్



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలోని జయశ్రీ తన రెండో కాన్పు నిమిత్తం దగ్గరలో ఉన్న ధన్వాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది. అక్కడ వైద్యులు పరీక్షించి తనకు నెలలు నిండకముందే నొప్పులు ఎక్కువ కావడంతో హుటా హుటిన, దగ్గరలో ఉన్న నారాయణపేట జిల్లా ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో రిఫర్ చేశారు. సమాచారం అందుకున్న సిబ్బంది తక్షణమే ధన్వాడ ప్రభుత్వ ఆసుపత్రి చేరుకొని, నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న మార్గమధ్యలో చిన్న చట్టం దగ్గర మహిళా అంబులెన్స్‌లోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పుడే పుట్టిన మగ శిశువు పుట్టగానే ఏడవకపోవడం కదలికలు లేకపోవడం గమనించిన ఈఎంటి భరత్ వెంటనే సిపిఆర్ టెక్నిక్స్ సాయంతో ప్రథమ చికిత్స చేస్తూ ఉపిరి పోశాడు. వెంటనే తల్లి బిడ్డను నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ మహేందర్ పరీక్షించి, శిశు పుట్టగానే ఏడవకపోవడం, బరువు తక్కువగా ఉండడం, అత్యవసరం వైద్యం నిమిత్తం కొరకు, నారాయణపేట జిల్లా ఆసుపత్రిలో ఉండే ఉచిత మాత శిశు 108 అంబులెన్స్‌లో వెంటిలేటర్ సహాయంతో మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం పంపించారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో ఆపద్బాంధవులుగా, అపర సంజీవని లాగా సేవలు చేస్తున్న 108 సిబ్బందిని, ఈఎంటి భరత్ , ఫైలట్ వెంకటేష్‌లను జిల్లా ఆసుపత్రి వైద్యులు, పేషెంట్ బంధువులు అభినందించారు.

## కూలీల అవసరాలు తీర్చుతా

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండల కనిమెట్ట గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను వారి యొక్క అవసరాలను గ్రామ సర్పంచ్ రామ్ చందర్ యాదవ్ అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మీకు కావాల్సిన సదుపాయం గ్రామపంచాయితీ నుంచి అందిస్తామని మీకు ఏం అవసరం ఉన్నా పంచాయితీ సెక్రటరీ కలిసి మీ యొక్క వివరాలు అందజేయాలని అదేవిధంగా మీకు విపరీతమైన ఎండలు ఉన్నాయి. కాబట్టి తగు జాగ్రత్తలు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ రామచంద్ర యాదవ్, ఉప సర్పంచ్ జయరాములు, పంచాయితీ సెక్రెటరీ ప్రదీప్ కుమార్, వార్డు నెంబర్ మంద మల్లేష్, మద్ద బుచ్చమ్మ, నాగన్న, దయాకర్ , ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేను కలిసిన రాంపురం నాయకులు

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నేడు నంది హిల్స్ లోని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని వారి నివాసంలో వారిని కలిసి గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు ఎన్‌హెచ్ 44 నుండి రాంపూర్ గ్రామం వరకు మంజూరైనా బిటి రోడ్డు పనులను త్వరగా చేపట్టాలని గ్రామంలోని శ్రీ జమ్ములమ్మ గుడి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలనీ గ్రామంలోని పీర్ల చావిడి మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలనీ ఎమ్మెల్యే ను కోరడం జరిగింది. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో తన సొంత నిధులు ఎస్‌డిఎఫ్ నుండి మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంజిత్ కుమార్ జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు, మండల సీనియర్ నాయకులు సత్యా నారాయణ రెడ్డి, శేఖర్ రెడ్డి మురళీధర్ రెడ్డి, భగవంతు నాయుడు, రామ్మోహన్ రెడ్డి, బిమేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, మిద్దె బాలరాజ్ యాదవ్, బాబు నాయుడు, జాకీ బిసన్న తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** పేద ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. వలసల జిల్లాగా ఉన్న నారాయణపేటను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపు రూ.5 వేల కోట్లతో మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నందుకు ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగి ఇప్పుడు కాట్రేపలి నుంచి కాన్ కార్తి వరకు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. గతంలో పాలమూరు ప్రజల జీవనం ఆగమ్యగోచరంగా ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మక్తల్ నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పూర్తయితే ఇక్కడి ప్రాంతం మరో కోనసీమ అవ్వడం ఖాయమన్నారు. పచ్చని పంట పొలాలతో ఈ ప్రాంతం సస్యశామల్యం అవుతుందన్నారు. ఇకపై నారాయణపేట జిల్లా వలసల జిల్లా కాదని వలసలను తెచ్చుకొనే జిల్లాగా మారిపోనుందని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ.. రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ఫలితాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించడంతోపాటు అర్హులైన వారందరికీ పథకాలు అందించేలా గ్రామ, వార్డు సభలు జరిగాయని అన్నారు. అరైవ్ అలైవ్, సంక్షేమ శాఖ, ఇందిరమ్మ ఇండ్ల పథకం, కొత్త రేషన్ కార్డులు, మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన నిధులు, లబ్ధిదారుల వివరాలను కలెక్టర్ వివరించారు. కాగా కార్యక్రమంలో భాగంగా అంతకు ముందు రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ కుమార్, నారాయణపేట మక్తల్ కోస్గి మున్సిపల్ చైర్ పర్సన్‌లు కొండా శ్వేతా సత్య యాదవ్, వాకిటి మానస, నాగులపల్లి నరేందర్, పేట ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మత్స్య సహకార సంస్థ చైర్మన్ కాంత్ కుమార్, ఆర్టీవో మెంబర్ సోషల్ రాజేష్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, దామర గిద్ద విండో చైర్మన్ పుట్టి ఈదప్ప, స్థానిక పుర వైస్ చైర్ పర్సన్ మంజుల, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, జిల్లాకు చెందిన సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజాపాలనలో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గగ్గలపల్లి తేజ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాస్థాయి ప్రజాపాలన సమావేశాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లాస్థాయి ప్రజాపాలన సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా తెలంగాణ జాతీయ గీతాలాపనతో ప్రారంభమైన కార్యక్రమం అనంతరం, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఒక్కొక్కటి అమలు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రతిశాఖ అధికారి పెండింగ్ దరఖాస్తులు, ఫైళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయడం ప్రతి ప్రభుత్వ అధికారుల బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్ దేవ సహాయం, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి తదితర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రైతు నిర్లక్ష్యం.. మరో రైతుకు నష్టం

### అగ్నికి ఆహుతైన 13 మామిడి చెట్లు...



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఓ రైతు నిర్లక్ష్యం మరో రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వీపనగండ్ల గ్రామ శివారులో జరిగిన ఈ ఘటన స్థానిక రైతుల్లో ఆందోళన కలిగించింది. వరి కోత అనంతరం మిగిలిన కొయ్యలకు నిప్పు పెట్టి నిర్లక్ష్యంగా వదిలేయడంతో మంటలు గాలికి వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న మామిడి తోటను కబలించాయి. గ్రామానికి చెందిన రైతు మండ్ల శేఖర్ తెలిసిన వివరాల ప్రకారం, తన మామిడి తోటకు సమీపంలోని ఓ రైతు వరి కొయ్యలను కాల్చేందుకు నిప్పు పెట్టాడు. అయితే మంటలు పూర్తిగా ఆరిపోయాయో లేదో చూడకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడంతో గాలికి మంటలు విస్తరించి శేఖర్ కు చెందిన తోటలోకి చేరాయి. కాసేపట్లోనే మంటలు ఉధృతరూపం దాల్చి తోటలోని 13 మామిడి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఏళ్ల తరబడి కష్టపడి పెంచుకున్న చెట్లు కళ్ల ముందే కాలిపోవడంతో బాధిత రైతు కన్నీరుమున్నిరయ్యాడు. '' ఈ చెట్లే మా కుటుంబానికి ఆధారం. ఒక్కసారిగా 20 మామిడి చెట్లు కాలిపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు'' అంటూ శేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక రైతులు స్పందిస్తూ, పంట అవశేషాలను కాల్చే సమయంలో రైతులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

## కూలీలకు తక్షణమే వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/అమరచింత :** ఉపాధి హామీ పథకం ద్వారా పనులను చేస్తున్న కూలీలకు తక్షణమే వేతనాలను చెల్లించాలని సిపిఐ పార్టీ అమరచింత పట్టణ సహాయ కార్యదర్శి కే.లక్ష్మీ నారాయణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని భూత్పూర్ కాల్వపనులను పూడికతీత, జమ్మూ కంప చెట్లను తొలగిస్తున్న ఉపాధి కూలీలతో సిపిఐ నాయకులు మాట్లాడుతూ ఉపాధి పనులను చేస్తున్న కూలీలతో సిపిఐ నాయకులు మాట్లాడుతూ ఉపాధి పనులను చేస్తున్న కూలీలకు కనీస వసతులను కల్పించడం లేదని ఆరోపించారు. మండుటెండలో ఉపాధి కూలీలు శ్రమ చేస్తూ అనేక ఇబ్బందులను పడుచున్నారని ఆయన ఆందోళన చెందారు భూత్పూర్ కాలువలో పూడిక తీత పేరుకుపోయిందని, కంప చెట్లు విపరీతంగా పెరిగిపోయావని వాటిని తొలగించడానికి కూలీకలు అనేక ఇబ్బందులు కలుగుతున్నావని ఆయన విచారం వ్యక్తం చేశారు. భూత్పూర్ కాలువ అమరచింత చేరువు నుంచి పిన్నంచర్ల, బాలకిస్తాపూర్ వరకు ఉన్న కాలువ పూడికతీత పనులను ఉపాధి కూలీలు చేస్తున్న పనులు ప్రభుత్వ అధికారులు ఇప్పటివరకు వేతనాలను చెల్లించడం లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రంగన్న, సబ్బు నాయక్, కుమార్, ఉపాధి కూలీలు ఉన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయడమే కాక ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుమోహన్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఇప్పటివరకు పలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల గురించి శుక్రవారం గద్వాలలోని బృందావన్ గార్డెన్‌లో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ గీతాన్ని అలపించిన అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే కాక ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేసిన, త్వరలో అమలు చేయబోయే వివిధ సంక్షేమ పథకాల, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ దాదాపు మూడు నెలలకుపైగా సుదీర్ఘంగా నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో న్యూ అరైవ్, అలైవ్ వారోత్సవాల్లో ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముఖ్య అతిథులు సందర్శించి తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి , వైస్ చైర్మన్ శంకర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి

### గోదాం వద్ద పరిస్థితిని పరిశీలించిన తహసీల్దార్, ఎస్సై

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వ గోదాంలకు తరలించి అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని తాహసీల్దార్ ఖాజా మైనుద్దీన్, ఎస్సై నరేష్ గోదాం నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం వీపనగండ్ల సమీపంలోని ప్రభుత్వ గోదాంను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం వద్ద రైతులు, హమాలీలతో మాట్లాడిన అధికారులకు సమస్యలను తెలుసుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన లారీలు, ట్రాక్టర్లు ధాన్యం బస్తాలతో ప్రధాన రోడ్డుపై గంటల తరబడి అన్లోడింగ్ కోసం వేచి ఉండటం గమనించారు. గోదాంలో సరిపడా హమాలీలను నియమించకపోవడంతో అన్లోడింగ్ ఆలస్యమవుతోందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గోదాం నిర్వాహకులు వెంటనే హమాలీల సంఖ్యను పెంచుకుని ధాన్యం బస్తాల అన్లోడింగ్‌ను వేగవంతం చేయాలని తాహసీల్దార్ ఆదేశించారు. రైతులకు, హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశమున్నందున ధాన్యం తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాంలకు వచ్చే ధాన్యాన్ని క్రమపద్ధతిలో ఒకరి తర్వాత ఒకరికి అన్లోడింగ్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.






## మొగ్దుంపూర్- జక్లేర్ బస్సు పునః ప్రారంభంపై హర్షం

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** నారాయణపేట డిపో ఆధ్వర్యంలో నడిచే మొగ్దుంపూర్ జక్లేర్ బస్సు పునఃప్రారంభం కావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఈ బస్సు నిలిపివేయబడటంతో సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా ఆధ్వర్యంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రయాణికులు కలిసి డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ లావణ్య మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల అవసరాల దృష్ట్యా బస్సు నడుపుతున్నామని, పాఠశాలలు ప్రాంభమైన తర్వాత తిరిగి సేవలు ప్రారంభిస్తామని తెలిపారు. అయితే సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా స్పందిస్తూ, ఈ బస్సు ఎన్నో సంవత్సరాలుగా సాధారణ ప్రయాణికుల అవసరాలకు కూడా ఎంతో ఉపయోగపడుతోందని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు మార్చి, ఏప్రిల్ నెలల కలెక్షన్ వివరాలను పరిశీలించి బస్సు పునః ప్రారంభంపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అన్ని అంశాలను పరిశీలించి, ప్రయాణికులు, విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి బస్సు సేవలను తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, విద్యార్థులు , గ్రామ ప్రజలు ఆర్టీసీ అధికారులకు, డీపో మేనేజర్ లావణ్యకు ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం



పెయింటింగ్ పోటీలకు అనూహ్య స్పందన

**ప్రజాపక్షం/జడ్చర్ల :** అంతర్జాపతీయ జీవవైవిధ్య దినోత్సవం ను పురస్కరించుకొని స్థానిక డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ బొటానికల్ గార్డెన్, అసోసియేషన్ ఫర్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పెయింటింగ్ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం నాడు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని దాని ప్రముఖ్యతను విద్యార్థులలో చొప్పించడానికి జీవవైవిద్య సంరక్షణలో పాఠశాల పాత్ర అనే అంశాన్ని పెయింటింగ్ పోటీలకు ఇచ్చినట్టుగా తెలిపారు. కళాశాలలోని సెమినార్ హాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించడమైంది. గరిష్ట సంఖ్యలో 100 మంది విద్యార్థులు జడ్చర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాలలో చదువుతన్న జడ్చర్లలో నివాసముంటున్న విద్యార్థిని విద్యార్థులు అందరూ ఈ పోటీలలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బొటానికల్ గార్డెన్‌ను చూపించి దానికి అనుబంధంగా ఉన్న జీవవైవిద్య పరిశోధన, విద్యా కేంద్రంలో పాములపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ముంగిపు సభలో అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.సుకన్య మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న కళాత్మక నైపుణ్యాలను వెలికితీయడం కోసమే ఈ పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్ అందజేశారు. న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించిన కిరణ్మయి, భవన, గోనెల రవిశంకర్‌ని కళాశాల ప్రిన్సిపల్, సదాశివయ్య సత్కరించడమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌తో పాటు నోటు పుస్తకాలు పెన్ను, టోపీలు బహుమానంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి వారి తల్లిదండ్రులకు సుమారు 1000 ఔషధ మొక్కలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పరిశోధక విద్యార్థులు రమాదేవి, రాహుల్, వీరాంజనేయులు, రవీందర్, సంస్కార్ స్కూల్ కరెస్పాండెంట్ గడ్డం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన కుటుంబాలను ఆదుకోండి

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో గురువారం రాత్రి కురిసిన భారీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి సిక్కులోను పంపు కాలనీ వాసి బోయ ఈరన్న సిమెంట్ పెంకుటిల్లు ఈదురుగాలులకు పూర్తిగా దెబ్బతిన్నడంతో పాటు ఇంట్లో ఉన్న కుటుంబ పెద్ద అయిన ఈరన్నకు వీరి కుమారుడు అంజికి కాళ్లకు తలకు స్వల్పగాయాలు లోపట దెబ్బలు తగలడం జరిగింది. వీరిని చికిత్స నిమిత్తము కొరకు ప్రభుత్వ, ప్రైవేట్ హస్పిటల్ ఏమర్జెంపిగా తీసుకుని పోవడానికి కూడ వీలు లేని పరిస్థితిలో ఉన్నందున ఈ కాలనీకి చెందిన పెద్దలు యువకులు గ్రామం నుంచి స్టేజి రోడ్డు వరకు అడ్డుగా ఉన్న విరిగి పడిన పెద్ద చెట్లను తొలగించి గాయపడిన వారిని కర్నూల్ ప్రైవేట్ హస్పిటల్‌కు ఈ వీధికి చెందిన కోట్టె లక్ష్మయ్య కారు వాహనంలో తీసుకెళ్లి చికిత్సలు చేశారు. కావున సంబంధిత ప్రభుత్వ జిల్లా కలెక్టర్ జిల్లా డిపిఓ మండల ఎమ్మార్వో మండల ఎంపిడిఓ గ్రామ పంచాయితీ కార్యదర్శి, అధికారులు స్పందించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త శాంతకుమార్, కొట్టే లక్ష్మయ్య, కుర్వ మధు, గోవిందు, నారాయణ, భూషణం, నాగేష్, మన్యం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల పెంపులో శాస్త్రీయత లేదు

**ప్రజాపక్షం/మక్తల్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో కార్మిక శాఖ పరిధిలోని షెడ్యుల్డ్ ఎంప్లామెంట్స్‌లో కనీస వేతనాలు పెంపుదలను ప్రకటించారు కానీ వేతనాల పెంపులో శాస్త్రీయత లేదని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిఆర్ గోవింద్ రాజ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ సుమారు 14 సం.ల తరువాత రాష్ట్రంలో కనీస వేతనాలు సవరించడం ఆహ్వానించదగ్గ పరిణామం. 26 జూన్ 2 నుండి సవరించిన వేతనాలు అమలు చేస్తామని ప్రకటించారు. కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కల్గుతుందని చెప్పారు. ప్రకటించిన వేతనాలు పెరిగిన ధరలకు, అణుగుణంగా కార్మికులు, కార్మిక సంఘాల చేసిన డిమాండ్‌ను పట్టించుకోకపోవడం తీవ్ర అసంతృప్తిని కల్గిస్తుందని, ముఖ్యమంత్రి వేతనాలు పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని, దేశానికే ఆదర్శవంతంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని ప్రకటించారు. ఆచరణలో చూస్తే ముఖ్యమంత్రి ప్రకటించిన వేతనాల పెంపుదలలో శాస్త్రీయత లోపించిందని, ఆశాస్త్రీయమైన పద్ధతిలో వేతానాలను ప్రకటించారని అన్నారు. పెరిగి ధరలను అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కనీస వేతనం రూ.26,000/లుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలు, 1948 కనీస వేతనాల చట్టం, డాక్టర్ ఆక్ట్రాయి ఫార్ములా, సుప్రీం కోర్డు తీర్పులకు అనుగుణంగా వేతనాలు పెంచలేదు. శాస్త్రీయంగా లెక్కిస్తే రూ.32,000/లు వస్తుంది. అయినప్పటికినీ కార్మిక సంఘాలు కనీస వేతనం రూ. 26 వేలు ఉండాలన్నారు. కార్మిక సంఘాల డిమాండ్లను పరిగణలోకి తీసుకొని ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు.

## చింతలకుంట 'అండర్‌పాస్' పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులపై ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జిహెచ్ ఎంసి ప్రాజెక్టు ఇఇ రోహిణితో ఫోన్‌లో మాట్లాడారు. దాదాపు నెలన్నర క్రితం తవ్విన రోడ్డు పనులు ఇప్పటికే పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అండర్‌పాస్ సౌకర్యం లేక హయత్ నగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. యూటర్న్ కోసం ఎల్‌బి నగర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో ప్రయాణ సమయంలో పెరగడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. ప్రతి రోజు వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చింతలకుంట అండర్ పాస్ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు గండికోట శ్రీనాథ్, ఛాతిరి మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి సహకారం

మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ అభివృద్ధి కోసం, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు తమ సహకారం ఉంటదని మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక కావడంతో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీలు అభివృద్ధి చెందాలంటే కాలనీ సంక్షేమ సంఘం పట్టుకొమ్మలన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. నూతన అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నీట్టు కృష్ణ, ఉపాధ్యక్షులుగా రంగాచార్యులు, వర ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి సుదర్శనం, సంయుక్త కార్యదర్శి కృష్ణారెడ్డి, రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి, కార్యవర్గ సభ్యులు పాండు, జయరాజు, రాజు, రామచంద్ర మూర్తి, ఉమాశంకర్, ప్రవీణ్, మేహేష్ తదితరులు ఉన్నారు.

## విఓఎల డిమాండ్లు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కడ్తాల్:** విఓఎల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ కడ్తాల్ మండలంలో విఓఎలు చేపట్టిన సమ్మె శుక్రవారం 5వ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా విఓఎలు మాట్లాడుతూ గత సంవత్సరాల నుంచి ఉద్యోగం చేస్తున్నప్పటికీ సరైన గుర్తింపు వేతనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస జీతం రూ.20,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులను గుర్తించి, హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని, అర్హులైన విఓఎలను సిసిలుగా పదోన్నతి కల్పించాలని, విఓఎలకు సాధారణ,ఆరోగ్య భీమా సౌకర్యం రూ.20 లక్షలు కల్పించాలని, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, జీవో 58 సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడ్తాల్ మండల విఓఎల కమిటీ అధ్యక్షుడు బి.జానకి రాములు. కార్యదర్శి ఇ.వనిత, కోశాధికారి పి.జంగయ్య, విఓఎలు కె.లావణ్య, ఎస్.చైత్ర, యు.జంగయ్య గౌడ్, ఎస్.బాలరాజు, డి.అనసూయ, కె.సుధారాణి, ఎస్.శోభా, ఇ.అరుణ, ఇ.రాజేశ్వరి, ఎ.విజయ, కె.సునీత, ఎస్.శైలజ, ఆర్.జ్యోతి, ఆర్.స్వాతి పాల్గొన్నారు.

## జపాన్‌లోని టోక్యోలో అలరించిన హైదరాబాద్ కళాకారులు



**ప్రజాపక్షం/మియాపూర్:** జపాన్ రాజధాని టోక్యోలోని రామ్ మందిరం భారతీయ ఆధ్యాత్మికత, సాంస్కృతిక సంప్రదాయాల సందడితో కళకళలాడింది. భారతీయ కళారూపాల ప్రాచుర్యానికి వేదికగా నిలిచిన ఈ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం భక్తి, సంగీతం, నృత్యాల సమ్మేళనంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి సోడో సిటీ మేయర్ హాజరై కళాకారుల ప్రతిభను అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన "నాట్యం డివోషనల్ ఆర్ట్ ఫార్మ్స్" సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో ప్రముఖ కళాకారిణి, ఆర్టిస్టిక్ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి హరికుమార్ తన బృందంతో కలిసి అద్భుతమైన కూచిపూడి నృత్య సేవను అందించారు. వీణా, గాన సేవతో భక్తి వాతావరణం ప్రముఖ వీణా, గాన కళాకారిణి శైలరాజా కుమారి గాన సేవ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీణా స్వరాలు, భక్తి గీతాలు ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత మధురంగా మార్చాయి. విదేశీ నేలపై భారతీయ సంగీత సంప్రదాయాల ఔన్నత్యాన్ని ఆమె తన గానంతో చాటిచెప్పారు. కార్యక్రమంలో విద్యార్థినులు నాగహర్షిణి, సయ్యద్ దీటా హసన్, సుజాత, సిరిష ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. గురువు డాక్టర్ విజయలక్ష్మి కల్వచర్ల మార్గదర్శకత్వంలో వారు చూపిన అభినయం, నాట్య నైపుణ్యం అందరినీ ఆకట్టుకుంది. టోక్యోలో జరిగిన ఈ సాంస్కృతిక మహోత్సవం భారతీయ కళలు, భక్తి సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతగానో ఆదరణ పొందుతున్నాయనే విషయాన్ని మరోసారి నిరూపించింది. భారతీయ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై గర్వంగా ప్రతిష్ఠించిన ఈ కార్యక్రమం తెలుగు కళాకారులకు విశేష గుర్తింపును తీసుకొచ్చింది

# ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు

శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా ముందుకు సాగుతాయని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయడమే కాక ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం దోహదపడుతుందని మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలే పరిష్కారంగా సిఎం ఎ.రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల ప్రజా పాలనలో రంగారెడ్డి జిల్లా అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు తీసాయని ఆయన వివరించారు. పది కార్యక్రమాల అమలులో భాగంగా జిల్లాలో 2 లక్షల 97వేల మంది రైతులకు రూ.722 కోట్ల రైతు భరోసా అందించడం జరిగిందని, రైతు బీమా పథకం కింద జిల్లాలో 735 మంది రైతు కుటుంబాలకు రూ.367 కోట్ల ఆర్థిక సాయం అందించడం తోపాటు జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున పట్టణ ప్రాంతాలను మినహాయిస్తే జిల్లాలో 16,050 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయని వీటికి 22 కోట్ల నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో మూడు లక్షల 52000 మంది లబ్ధి చేకూరేలా లక్ష ఆరువేల కొత్త రేషన్ కార్డులు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 1,91,000 మంది లబ్ధిదారులకు ఆసరా పింఛన్లను అందిస్తున్నామన్నారు. జిల్లాలో మహిళల ఉచిత ప్రయాణంలో భాగంగా 203 కోట్ల టికెట్లను మహిళలకు అందించి ఉచిత ప్రయాణాలను కల్పించడం ద్వారా ప్రభుత్వం 977 కోట్ల ఆర్థిక భారాన్ని మోస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఫ్యూచర్ సిటీ పెట్టుబడులకు స్వర్గధామం ఉంటుందన్నారు. కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ మార్చి 6న ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలను, సాధించిన విజయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయి సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. టిడిఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి ప్రయోజనం ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశం పెట్టి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరే విధంగా జిల్లాలోని అన్నీ శాఖలు సమన్వయంతో పని చేసి రంగారెడ్డి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. సమావేశంలో ఇందిరా మహిళా శక్తి సంఘాలకు బ్యాంకు రుణాల చెక్కులను అందించారు. కళ్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ట్రాన్స్ జెండర్లకు ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా రెవిన్యూ శాఖలో వివిధ స్థాయిల్లో పేరుకుపోయిన పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని రోడ్లు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. రెవిన్యూ శాఖ అధికారులు భూముల సమస్యలు క్లియర్ చేయకపోవడం మూలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుంటుపడుతుందని, తక్షణమే ఈవిషయంపై కలెక్టర్ చొరవ తీసుకొని మండల, డివిజన్, జిల్లా స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫైళ్లను క్లియర్ చేయడం లేదా రిజెక్ట్ చేయడం తేల్చాలని తెలిపారు. భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని షాద్ నగర్ ఎమ్మెల్యే శంకరయ్య గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ప్రజలకు తీవ్ర హాని కలిగించే ఫార్మా ఇండస్ట్రీ లను పక్కనపెట్టి ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టిందని మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, వివిధ కార్పోరేషన్‌ల చైర్మన్‌లు జ్ఞానేశ్వర్, అదనపు కలెక్టర్ లు చంద్రా రెడ్డి, డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, జిల్లా అధికారులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## డిజిటల్ సంపద భారతీయులకే ఉపయోగపడాలి

ఆజూబాజూ. ఇన్ స్టార్టప్ వ్యవస్థాపకుడు కిషోర్ వాసుదేవన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశ డిజిటల్ సంపద భారతీయ కుటుంబాలకే ఉపయోగపడాలని 'ఆజూబాజూ.ఇన్' అనే స్టార్టప్ వ్యవస్థాపకులు కిషోర్ వాసుదేవన్ అన్నారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషోర్ వాసుదేవన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ వేగంగా దూసుకుపోతోందన్నారు. ఒక నిశ్శబ్ద ఆర్థిక ప్రవాహం ప్రతిరోజూ దేశం దాటి వెళ్తోందన్నారు. భారతీయ ప్రకటనదారులు, విక్రేతలు, కంటెంట్ క్రియేటర్లు, చిన్న వ్యాపారాలు సృష్టిస్తున్న వేల కోట్ల రూపాయల డిజిటల్ ఆదాయం విదేశీ డిజిటల్ అగ్రిగేటర్ సంస్థల పాలవుతోందని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చి, భారతీయ సంపదను దేశంలోనే నిలిపి ఉంచేందుకు తాను స్వదేశీ స్టార్టప్ 'ఆజూబాజూ.ఇన్ 'డిజిటల్ వ్యవస్థలో భారతీయులను కేవలం వినియోగదారులుగా కాకుండా, డిజిటల్ పారిశ్రామికవేత్తలుగా మార్చడం' అనే నినాదంతో ఈ సరికొత్త ప్లాట్‌ఫారమ్‌ను స్థాపించామన్నారు. సాధారణ భారతీయులు తమ స్వంత డిజిటల్ వ్యాపారాలను నిర్మించుకునేలా ఒక సమగ్ర డిజిటల్ పర్యావరణ వ్యవస్థను ఇది ఆవిష్కరిస్తోందన్నారు.

**ఇది వ్యాపారం కాదు.. ఒక జాతీయ ఉద్యమం...** ఆజూబాజూ.ఇన్ కేవలం ఒక స్టార్టప్ మాత్రమే కాదని, ఇది చిన్న పట్టణాలు, గ్రామాలు, మధ్యతరగతి కుటుంబాలు, నిరుద్యోగ యువత, మహిళలు, ఫ్రీలాన్సర్లు, స్థానిక వ్యాపారాల కోసం లక్షలాది డిజిటల్ పారిశ్రామికవేత్తలను తయారు చేసే ఒక జాతీయ ఉద్యమం అని కిషోర్ వాసుదేవన్ అన్నారు. భారతీయులను కేవలం వినియోగదారులుగా కాకుండా, యజమానులుగా, సృష్టికర్తలుగా, విక్రేతలుగా, ప్రచురణకర్తలుగా, సేవలందించేవారిగా తీర్చిదిద్దడమే ఈ సంస్థ ప్రధాన సంకల్పమన్నారు. 'భారత డిజిటల్ భవిష్యత్తు భారతీయ కుటుంబాలకు సంపదను సృష్టించాలి' అనే ప్రధాన లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఆజూబాజూ.ఇన్ ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు దేశభక్తి గల పారిశ్రామికవేత్తలు, దాతలు, సామాజిక నాయకులు, మీడియా సంస్థలు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలను ఆహ్వానిస్తోందన్నారు. వ్యూహాత్మక మార్గదర్శకత్వం, మీడియా సహకారం, ప్రజల్లో అవగాహన, భాగస్వామ్యాలు, మెంటర్షిప్, పెట్టుబడుల రూపంలో ఈ మద్దతును అందించాల్సిందిగా కోరారు. కోట్లాది భారతీయులను ఆర్థికంగా బలమైన, స్వయం సమృద్ధి గల డిజిటల్ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఈ స్వదేశీ ప్లాట్‌ఫారమ్ కట్టుబడి ఉందని కిషోర్ వాసుదేవన్ అన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ : 7207817237, వెబ్‌సైట్ : www.aajubaaju.in సంప్రదించాలని కోరారు.

## హెచ్‌సిఎలో అవినీతిపైన సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో భారీ అవినీతిపైన సమగ్ర దర్యాప్తు చేపట్టాలని 'అఖిల భారత యువజన సమాఖ్య' (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. హెచ్‌సిఎలో వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమ ఆర్థిక లావాదేవీలు, టికెట్ బ్లాక్ మార్కెట్, క్రికెట్ పరిపాలనలో పారదర్శకత లేకపోవడం రాష్ట్ర ప్రజలను, క్రీడాభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. రూ 20 వేల కోట్ల విలువైన టికెట్ల వ్యవహారంలో అవినీతి దందాలకు దారితీసిందని వారు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పించాల్సిన సంస్థలో లాబీయింగ్, డబ్బు, రాజకీయ ప్రభావం పెరగడంతో నిజమైన ప్రతిభ వెలుగులోకి రావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో జరిగిన అన్ని ఆర్థిక లావాదేవీలపైన సమగ్ర విచారణ చేపట్టాలని, అవినీతికి పాల్పడిన అధికారులు, మధ్యవర్తులు, బ్లాక్ మార్కెట్ ముఠాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి,వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## పర్యాటక రంగానికి కొత్త దిశానిర్దేశం నేడు నిథమ్‌లో పర్యాటక సదస్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతో పాటు రంగ అభివృద్ధిలో కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మక పర్యాటక సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) ఆధ్వర్యంలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖతో పాటు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా శనివారం గచ్చిబౌలిలోని నిథమ్ ప్రాంగణంలో 'డెస్టినేషన్ తెలంగాణ – రోడ్ ఎహెడ్‌అనే థీమ్‌తో సదస్సు నిర్వహించనున్నాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. సదస్సులో భాగంగా పర్యాటక రంగానికి సంబంధించిన కీలక ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పాటు తెలంగాణ పర్యాటక 'బ్రాండ్ కిట్'ను ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల్లో ఈ సదస్సు ముఖ్య ఘట్టంగా నిలవనుందని నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతో పాటు అభివృద్ధిలో కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాలతో సదస్సు ప్రారంభం కానుందన ఆయన తెలిపారు.

## బొటానికల్ గార్డెన్‌లో జీవవైవిధ్య దినోత్సవం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బొటానికల్ గార్డెన్‌లో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సీడ్ బాల్స్ (విత్తన బంతులు) తయారీ, పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బొటానికల్ గార్డెన్‌లోని 'ధన్వంతరి వనం'లో జరిగిన ఈ కార్యక్రమం ప్రజా భాగస్వామ్యంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఏడాది అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ నినాదమైన 'ప్రపంచ ప్రభావం కోసం స్థానికంగా కార్యాచరణ' కు అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం వాకింగ్‌కు వచ్చే పౌరులు పర్యావరణ పరిరక్షకులుగా మారి చురుకుగా పాల్గొన్నారు. 80 మందికి పైగా వాకర్స్ స్థానిక వృక్ష జాతుల విత్తనాలతో వేలాది సీడ్ బాల్స్ తయారు చేసి నగర పచ్చదనం పెంపొందించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా టిజిఎఫ్‌డిసి ఎకోటూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్. రంజిత్ నాయక్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టే చిన్నచిన్న చర్యలే ప్రపంచ జీవవైవిధ్య లక్ష్యాల సాధనకు పునాదిగా నిలుస్తాయని అన్నారు. మట్టి, కంపోస్ట్‌తో రూపొందించే సీడ్ బాల్స్ నగరంలోని పచ్చని కారిడార్ల పునరుద్ధరణకు దోహదపడతాయని వివరించారు. నగరానికి ఊపిరితిత్తుల్లా సేవలందిస్తున్న బొటానికల్ గార్డెన్ జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ విద్య, ప్రకృతి అవగాహనకు కేంద్రంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇక్కడి విభిన్న వృక్ష సంపద విద్యార్థులు, పర్యాటకులు, పౌరులు ప్రకృతితో మరింత అనుబంధం పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ వి.లక్ష్మారెడ్డి, ప్రాజెక్ట్స్ మేనేజర్ (ఎకోటూరిజం) కె.సుమన్, హెడ్ నేచురలిస్ట్ ఎమ్. అఖిల్, బొటానిస్ట్ డాక్టర్ ఐ. వీరకిశోర్, నేచురలిస్ట్‌లు సామ్సన్ రాజు, దినేష్‌కుమార్, రోహిత్ తదితరులతో పాటు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పాల్గొన్నారు.

# ప్రజా రవాణాను ఆదర్శవంతంగా మారుస్తాం

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజారవాణాను ఆదర్శవంతంగా మారుస్తామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని విద్యాసంస్థల్లో విద్యార్థుల రవాణా సమస్యలను పరిష్కరించడానికి, ట్రాఫిక్ రద్దీని తగ్గించి, భద్రతను పెంపొందించడానికి ఒక వినూత్నమైన "స్టూడెంట్ మొబిలిటీ ప్లాన్" (విద్యార్థుల రవాణా ప్రణాళిక)ను రూపొందించారు. ట్రాఫిక్ రద్దీ నివారణ, నిబంధనల అమలు, విద్యార్థుల భద్రత, తక్కువ ఖర్చు అనే నాలుగు ముఖ్యమైన అంశాలే లక్ష్యంగా ఈ విధానాన్ని తీసుకువచ్చారు. ఇందులో భాగంగా సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సిఎస్‌సి) సంయుక్తంగా 526 విద్యాసంస్థల్లోని 4.1 లక్షల మంది విద్యార్థులపై క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలో విద్యార్థుల రవాణా వ్యవస్థలో అనేక లోపాలు వెలుగుచూశాయి. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా పాఠశాలలు, రవాణా ఆపరేటర్లు, తల్లిదండ్రులు, పౌర అధికారులను ఒకే సమన్వయ వేదికపైకి తీసుకువచ్చేలా సాంకేతిక ప్లాట్‌ఫారమ్‌ను సిద్ధం చేశారు. ఈ సరికొత్త రవాణా విధానంపై విద్యాసంస్థలకు అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని ఐఇఐ ఇ ఎస్‌సిఐ శతాబ్ది కన్వెన్షన్ సెంటర్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, ఎస్‌సిఎస్‌సి సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించాయి. సైబరాబాద్ పరిధిలోని సుమారు 500 విద్యాసంస్థలకు చెందిన 750 మందికి పైగా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడానికి, అందరికీ అందుబాటులో ఉండే జవాబుదారీతనంతో కూడిన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఈ సదస్సు ఒక కీలక అడుగు గా నిలిచింది. కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులతో పాటు టిజిఆర్‌టిసి, సిఎంసి, ఆర్‌టి ఏ, జిల్లా విద్యాశాఖ అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు, రవాణా ఆపరేటర్లు పాల్గొని, సర్వే ఫలితాలు, వాటి పరిష్కారాలపై చర్చించారు. ఈసదస్సులో సైబరాబాద్ సిపి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ప్రతిరోజూ పాఠశాలల సమయాల్లో రవాణా వ్యవస్థ తీవ్రమైన ఒత్తిడికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు ముగిసే సమయంలో కేవలం 15నిమిషాల వ్యవధిలోనే సైబరాబాద్ వ్యాప్తం గా వివిధ క్యాంపస్ నుంచి దాదాపు 2 లక్షల వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయని, ఈ రద్దీ కొన్ని రోజుల్లో సైబరాబాద్ ఐటి కారిడార్‌లో పీక్ అవర్స్‌లో ఉండే ట్రాఫిక్ కంటే ఎక్కువగా ఉంటోందని రికార్డుల ద్వారా స్పష్టమైందని తెలిపారు. ఈ ట్రాఫిక్ సమస్య కుటుంబాల దైనందిన జీవితాలపై తీవ్రప్రభావం చూపుతోందని, అందువల్ల దీనికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత అనేది పాఠశాల గేటుతో ముగిసిపోదని, ఒక బిడ్డ ఇల్లు వదిలి బయటకు వచ్చినప్పటి నుంచి తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకునే వరకు అది కొనసాగుతుందని అభిప్రాయపడ్డారు. అవగాహన సదస్సులో కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి సృజన కె, ట్రాఫిక్ డిసిపి శేషాద్రిని రెడ్డి, శేరిలింగంపల్లి జెడ్‌సి నారాయణ అమిత్, కూకట్‌పల్లి జెడ్‌సి మయాంక్ సింగ్, ఆర్‌టిసి డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కల్యాణి, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రామేశ్వరరావు పాల్గొన్నారు.

### రైతుల పేరుతో కెటిఆర్

# శవరాజకీయాలు మానుకోవాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతాంగంలో గందరగోళం సృష్టించి, అపోహలు కల్పించడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందడమే బిఆర్ఎస్ నేత కెటిఆర్ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎవరి మరణమైనా ప్రభుత్వానికి బాధాకరమేనని, అయితే కనీస వాస్తవాలు నిర్ధారించుకోకుండా రైతుల మరణాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అత్యంత దురదృష్టకరమని, ఇది ముమ్మాటికీ 'శవరాజకీయమే' అని విమర్శించారు. రైతుల పేరుతో రాజకీయ డ్రామాలు ఆపాలని, శవరాజకీయాలు మానుకోవాలని కెటిఆర్‌కు హితవు పలికారు. కెటిఆర్ మాటల్లో రాజకీయ నిరాశ, అసహనం స్పష్టంగా కనిపిస్తున్నాయని మంత్రి అన్నారు. అందుకే వాస్తవాలను వక్రీకరించి రైతుల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగుతోందని, కొనుగోళ్లు, చెల్లింపుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచుతున్నామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పాలనలో కొనుగోలు కేంద్రాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని, మిల్లర్లతో కుమ్మక్కై రైతాంగాన్ని దోచుకున్న వారే ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడడం విచిత్రంగా ఉందని ఉత్తమ్ మండిపడ్డారు. 202122 రబీ సీజన్‌లో బిఆర్ఎస్ ప్రభుత్వం 26.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.2,624 కోట్లు మాత్రమే చెల్లించిందని తెలిపారు. 2022 23 రబీలో 36.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.3,160 కోట్లు చెల్లించిందన్నారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 202324 రబీ సీజన్‌లో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.6,112 కోట్లు చెల్లించామని చెప్పారు. 2024 25 రబీ సీజన్‌లో 60.44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.10,882 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటివరకు 48.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.8,203 కోట్లు చెల్లించినట్లు వివరించారు. గన్నీ బ్యాగుల కొరత ఉందన్న కెటిఆర్ ఆరోపణలను కూడా మంత్రి ఖండించారు. రాష్ట్రంలో మొత్తం 20 కోట్ల 86 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మేర సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కూడా కొనుగోలు కేంద్రాల్లో భారీగా గన్నీ బ్యాగులు నిల్వలో ఉన్నాయని తెలిపారు. ధాన్యం తరలింపునకు 1300 వాహనాలను వినియోగిస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తెలంగాణను దేశంలోనే ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో నెంబర్‌వన్‌గా నిలిపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

### హైదరాబాద్‌లో టెస్లా ఇవి కార్ల

# షోరూం దిశగా అడుగులు

మంత్రి శ్రీధర్ బాబుతో టెస్లా ప్రతినిధుల భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో విక్రయ, సేవల కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. టెస్లా ఇండియా ప్రతినిధులు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో శుక్రవారం సమావేశమై రాష్ట్రంలో కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ విద్యుత్ వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ఎకోసిస్టంను తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని తెలిపారు. సెమీకండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్వేర్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, డీప్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ వేగంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్, లీడ పబ్లిక్ పాలసీ అండ బిజినెస్ డెవలప్మెంట్ డైరెక్టర్ రజత్ మంత్రి బృందంతో సమావేశమై హైదరాబాద్లో సేల్స్, సర్వీస్ సెంటర్ ఏర్పాటుపై ఆసక్తి వెల్లడించినట్లు సమాచారం. దేశంలో ఇప్పటికే నాలుగు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసిన టెస్లా తదుపరి విస్తరణ కేంద్రంగా హైదరాబాద్ను పరిశీలించడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. టెస్లా కేవలం ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ మాత్రమే కాదని, సాఫ్ట్వేర్, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, బ్యాటరీ టెక్నాలజీలు, సెమీకండక్టర్లు, అధునాతన తయారీ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా ఆవిష్కరణలకు నాయకత్వం వహిస్తున్న సంస్థగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. టెస్లా దీర్ఘకాలిక సాంకేతిక లక్ష్యాలకు తెలంగాణలో ఉన్న పరిశ్రమల వాతావరణం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. తెలంగాణలో టెస్లాకు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పరిశీలించాలని మంత్రి సంస్థ ప్రతినిధులను కోరారు. పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ఐటి సలహాదారు సాయికృష్ణ, టిజిఐఐసి ఎండి శశాంక్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ప్రత్యేక కార్యదర్శి రఘురామ శర్మ తదితరులు పాల్గొన్నారు.



### కనీస వేతనాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ..

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో ఎక్కడాలేని విధంగా కనీస వేతనాల పెంపు తెలంగాణ రాష్ట్రంలోనే జరిగిందని, కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. కనీస వేతనాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో ఐఎన్‌టియుసి నేతలు గాంధీభవన్ వద్ద శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐఎన్‌టియుసి అగ్రనేత జి.సంజీవరెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్రంలోని 9,37,455 సంస్థల్లో పనిచేస్తున్న సుమారు ఉ.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కనీస వేతనాల పెంపును గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల పెరుగుదల, ఇంటి అద్దె వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని కార్మికుల శ్రేయస్సు కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం కనీస వేతనాలు పెంచినందుకు మొగుళ్ళ రాజిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదిల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పట్ల న్యాయస్థానం తీర్పు చరిత్రాత్మకం

ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికులు ప్రపంచంలో దోపిడీకి, అన్యాయాలకు గురవుతున్నారని, వాటి రక్షణకు తప్పనిసరిగా వారు సమ్మె చేస్తారని అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించడం చరిత్రాత్మకమైన తీర్పు అని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు. అంతర్జాతీయ న్యాయ స్థానంలో కార్మికుల సమ్మెహక్కుపైన 14 మంది న్యాయమూర్తులు విచారణ చేపట్టారని, ఇందులో మెజార్టీగా 10 మంది న్యాయమూర్తులు కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉందని తీర్పు వెలువరించిందని, ఈ తీర్పును ప్రపంచంలోని యావత్ కార్మికవర్గం గౌరవిస్తూ భవిష్యత్తులో జరిగే పోరాటాలకు,ఉద్యమాలకు అండగా ఉంటుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనాలను చెల్లించకుండా శ్రమదోపిడీకి గురిచేసినప్పుడు ప్రపంచంలోని కార్మికులందరూ పోరాటాన్ని ఎంచుకుంటారని బాల్‌రాజ్ తెలిపారు. సమ్మె చేసే హక్కు కార్మికులకు ఉన్నదని 78 సంవత్సరాల క్రితమే అంతర్జాతీయ న్యాయస్థానం తెలిపిందన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ 1948లో జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు సంబంధించిన ఒప్పందం కార్మికుల సమ్మె హక్కుకు రక్షణ కల్పిస్తుందని అంతర్జాతీయ న్యాయస్థానం చెప్పడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సమ్మె హక్కుకు రక్షణ కల్పిస్తుందని ఆనాటి ఒప్పందంపైన 158 దేశాలు సంతకాలు చేసినట్టు అంతర్జాతీయ న్యాయస్థానం పేర్కొందన్నారు.

### కార్మికుల కోసం శ్రమిస్తున్న ఐఎన్‌టియుసికి

# గుర్తింపు సంఘం ఎన్నికల్లో మద్దతివ్వాలి

ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి

గుర్తింపు సంఘం ఎన్నికల్లో 'త్రిశూలం' గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలి ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టియుసి)కు గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం అందించాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండున్నర సంవత్సరాల్లో జలమండలి ఉద్యోగులు, కార్మికుల దీర్ఘకాలిక సమస్యల్లో దాదాపు 90 శాతం పరిష్కారమయ్యాయని ఆయన పేర్కొన్నారు.హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లోని జలమండలి కేంద్ర కార్యాలయంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన మొగుళ్ళ రాజిరెడ్డి, వివిధ విభాగాల ఉద్యోగులు, కార్మికులను కలిసి యూనియన్ ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, పరిష్కరించిన అంశాలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. యూనియన్ గుర్తు 'త్రిశూలం'కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత గుర్తింపు సంఘం నాయకత్వం కార్మికుల సమస్యలను సమర్థంగా పరిష్కరించలేదని విమర్శించారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ప్రభుత్వం, జలమండలి యాజమాన్యం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి అనేక అంశాల్లో పరిష్కారాలు సాధించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం లభిస్తోందని పేర్కొన్న ఆయన, కార్మికులందరూ ఐఎన్‌టీయూసీ అనుబంధ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్‌కు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రావణ్ కుమార్‌తో పాటు పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో కెసిఆర్ లేనిలోటు కనిపిస్తోంది

మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ లేనిలోటు రెండున్నరేళ్లుగా కనిపిస్తోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. 'మలేషియా తెలంగాణ అసోసియేషన్, బిఆర్ఎస్ మలేషియా'సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6న కౌలాలంపూర్‌లో జరిగే కార్యక్రమ బోచర్‌ను జగదీశ్ రెడ్డి హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు' జూన్ 6న మలేషియాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 13 ఏళ్లుగా తెలంగాణ సంస్కృతిని నిలబెడుతున్నారని, బిఆర్ఎస్ మలేషియా ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయని వివరించారు. బిజెపి దేశంలో చిన్న పిల్లలకు రక్షణ లేకుండా చేస్తోందన్నారు. చిన్న పిల్లలపైన అఘాయిత్యాలు చేస్తున్న నిందితులను పట్టుకునే శక్తి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. బిజెపి నాయకులు అధికార మదంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గ్యాదరి బాలమల్లు, మహేష్ బిగాల, తిరుపతి, చిట్టీ బాబు, సుప్రియ, శివ తదితరులు పాల్గొన్నారు.



## 'సర్'కి సంబంధించి తెలంగాణ ఎన్ఆర్ఐల ఆందోళన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జీవనోపాధి నిమ్మితం గల్ఫ్ దేశాలకు వెళ్ళిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు బిఆర్ఎస్ తరపున ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్టు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. బిఆర్ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కెటిఆర్ శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక జాబితా సవరణ కోసం ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న 'సర్' కార్యక్రమానికి సంబంధించిన విషయంలో లక్షలాది మంది తెలంగాణ ఎన్ఆర్ఐలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీ తరపున ఒక సీనియర్ ప్రతినిధి, ఎంఎల్ఎలు, ఎంపిల బృందాన్ని ఢిల్లీకి పంపనున్నామని వివరించారు. 'సర్' నిమ్మితం నియమించిన బూత్ లెవెల్ అసిస్టెంట్ల ద్వారా గల్ఫ్ లోని తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు సహాయ సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు.

# భువనగిరి రైల్వే సమస్యలు పరిష్కరించండి

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

దక్షిణమధ్య రైల్వే జిఎం సెక్రటరీ, డిజిఎం శ్రీనివాస్ మల్లాదికి వినతి



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు రైల్వే సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి దక్షిణమధ్య రైల్వే అధికారులను కోరారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్యరైల్వే జిఎం కార్యదర్శి మరియు డిజిఎం (కోఆర్డినేషన్) శ్రీనివాస్ మల్లాదిని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గ రైల్వే సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.
ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భువనగిరి రైల్వే స్టేషన్ను ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు మరియు యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఉపయోగిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా స్టేషన్లో మౌలిక వసతులను అత్యవసరంగా మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని, భువనగిరి స్టేషన్లో పద్మావతి , కోణార్క్ , శాతవాహన, భద్రాచలం మచిలీపట్నం, తెలంగాణ ఎక్స్ప్రెస్ రైళ్లకు నిలుపుదల (హాల్ట్) కల్పించాలని ఎంపి కోరారు.

**ఎంఎంటిఎస్ బాధితులకు న్యాయం చేయాలి**

సికింద్రాబాద్ నుండి యాదగిరిగుట్ట (రాయగిరి) వరకు పొడిగించిన ఎంఎంటిఎస్ రైల్వే లైన్ పనుల కొరకు బీబీనగర్ ప్రాంతంలో ఇండ్లు కోల్పోయిన సుమారు 70 మంది బాధితులకు తగిన నష్టపరిహారం అందించి, తక్షణమే న్యాయం చేయాలని ఈ సందర్భంగా రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**వంగపల్లి - యాదగిరిగుట్ట మధ్య టూ-వే అండర్పాస్**

యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని వంగపల్లి యాదగిరిగుట్ట మధ్య రైల్వే అండర్పాస్ లేకపోవడం వల్ల నిత్యం తీవ్ర ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయని, తద్వారా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు అక్కడ ఆధునిక టూవే అండర్పాస్ బ్రిడ్జ్ను మంజూరు చేసి, త్వరితగతిన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సమర్పించిన వినతులపై డీజీఎం, జీఎం సెక్రటరీ శ్రీనివాస్ మల్లాది సానుకూలంగా స్పందించారు. భువనగిరి నియోజకవర్గ ప్రజల, ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రజా ఉపయోగకర పనులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ప్రాధాన్యత ప్రాతిపదికన ఈ సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీకి స్పష్టం చేశారు.



## రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది

బిజెపిఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని బిజెపిఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం నుంచి బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను పర్యటించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమక్షంలో పర్యటన చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్ల, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదని, లారీలు, గన్నీ బ్యాగులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఇప్పటికీ ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఒక బస్తాకు అదనంగా 4 కిలోలు కోత పెడుతున్నారని, రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. మొక్కజొన్న పూర్తిగా కొనుగోలు చేయడం లేదని, గన్నీ బ్యాగుల కోసం రైతులు వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కేవలం 24 శాతం మాత్రమే వడ్ల కొనుగోలు జరిగిందని, సిఎం చెప్పిన లెక్కల ప్రకారమే చూసినా 30 నుంచి 35 శాతం మించదన్నారు. రైతు పండించిన పంటలో 10 శాతం వరకు దోపిడీ జరుగుతోందని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మహిళా రైతులకు గ్లోబల్ మార్కెట్

సెర్ప్‌లో గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నేతృత్వంలోని సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలనలో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు మహిళా రైతులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో అవకాశాలు కల్పిస్తూ కొత్త మార్గాన్ని చూపుతోంది. రైతులు పండించిన పంటలను మధ్యవర్తులు లేకుండా నేరుగా మార్కెట్‌కు అనుసంధానం చేసే విధానాన్ని సెర్ప్ అమలు చేస్తోంది. ఆన్‌లైన్ మార్కెటింగ్, ఆధునిక రిటైల్ సంస్థలు, అంతర్జాతీయ మార్కెట్‌లతో రైతులను కలిపి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తోంది. సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భేనిశాన్ రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య (ఎఫ్‌పిసి) ద్వారా రాష్ట్రంలోని మామిడి రైతులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. పెబ్బేరు గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణ దంపతులు ఈ సీజన్‌లో మల్లిక రకం మామిడి పండ్లను విదేశాలకు ఎగుమతి చేయడం చిన్న రైతుల్లో కొత్త ఆశలు నింపింది. ఈ విధానం ద్వారా ఇప్పటివరకు మామిడి రైతులకు రూ.151 కోట్ల వ్యాపారం జరిగినట్లు అధికారులు తెలిపారు. రైతులకు అదనంగా 15 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం లభిస్తోందన్నారు. గతంలో తక్కువ ఉత్పత్తి ఉన్న రైతులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరుకోవడం కష్టసాధ్యంగా ఉండేది. అయితే భేనిశాన్ ద్వారా సమీకరణ, గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణా, సప్లై చైన్ సదుపాయాలు కల్పించడం వల్ల చిన్న రైతులు కూడా విదేశీ మార్కెట్లకు చేరుకునే అవకాశం పొందుతున్నారు. ప్రస్తుతం భేనిశాన్ సమాఖ్య పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 84 రైతు ఉత్పత్తిదారుల సంస్థలు పనిచేస్తున్నాయి. ఇవి 30 జిల్లాలు, 404 మండలాలు, 3,072 గ్రామాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. మొత్తం 1.09 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులే కావడం విశేషం. సెర్ప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రజిత నారెడ్ మాట్లాడుతూ ఎగుమతులకు వెళ్లే ప్రతి పండును నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఎంపిక చేసి ప్రాసెస్ చేస్తున్నామన్నారు. మామిడి పండ్ల నాణ్యత కాపాడేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో కోత, గ్రేడింగ్ వంటి అంశాలపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన అంటే కేవలం సంక్షేమ పథకాల అమలు మాత్రమే కాదని, గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయం వచ్చే వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమన్నారు. రైతులకు మార్కెట్ అవకాశాలు కల్పించడం, మధ్యదళారుల ఆధిపత్యాన్ని తగ్గించడం, మహిళా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం దిశగా సెర్ప్ చేపడుతున్న చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు.

# ప్లాస్టిక్ రహిత మైదానాలే లక్ష్యం

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని అన్ని క్రీడా మైదానాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ స్పోరట్స్ అథారిటీ కట్టుబడి పనిచేస్తోందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పోర్ట్స్ యూత్ వారోత్సవాలు' కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 'సర్వ్ అండ్ సపోర్ట్ – యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో స్టేడియాలు, క్రీడా మైదానాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యక్రమం హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
అదేవిధంగా తెలంగాణ స్పోరట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ స్టేడియంలలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు, సిబ్బంది కలిసి మైదానాలు, ప్లే ఫీల్డ్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని స్టేడియాలను దశలవారీగా ప్లాస్టిక్ రహిత మైదానాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

## నేడు టిజి పాలిసెట్ ఫలితాలు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టిజి పాలిసెట్) ఫలితాలు శనివారం ఉదయం విడుదలకానున్నాయి. ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఇఎస్‌డి ) విభాగం 'మీ సేవ' వాట్సాప్/చాట్ బాట్బాట్ వేదిక ద్వారా టిజి పాలిసెట్ ఫలితాలను వెల్లడించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ఉదయం 11:30 గంటల నుంచి వాట్సాప్ ద్వారా తమ ఫలితాలను తక్షణమే పొందే అవకాశాన్ని కల్పించినట్టు ఇఎస్‌డి కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
టిజి పాలిసెట్ ఫలితాలను 'మీ సేవ' వాట్సాప్ నంబర్ (8096958096) ద్వారా నేరుగా అభ్యర్థులకు అందుతాయని పేర్కొన్నారు.
ఫలితాలు అధికారికంగా విడుదలైన వెంటనే, అర్హత గల అభ్యర్థులు ఆటోమేటిక్‌గా ఫలితాల సమాచారాన్ని అందుకుంటారు. అభ్యర్థుల రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా పిడిఎఫ్ రూపంలో ఫలితాలు రానున్నాయి.



## డంపింగ్ యార్డ్ పవర్ ప్లాంట్ తరలించకపోతే ఆమరణ దీక్ష

### మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తండా2 లో ఉన్న డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్ కారణంగా స్థానిక ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని దుండిగల్ మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్ ఆరోపించారు. ఈ మేరకు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణికరన్ కు వినతిపత్రం అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా డంపింగ్ యార్డ్‌లో చెత్తను బహిరంగంగా వేయడం, అనంతరం మంటలు పెట్టడంతో తండా మొత్తం పొగతో కమ్ముకుపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ సమస్యలు, మహిళల్లో గర్భసంచి సంబంధిత అనారోగ్యాలు పెరిగిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గతంలో అప్పటి కమిషనర్ తండాలను మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేస్తామని, డంపింగ్ యార్డ్ చుట్టూ ప్రహరీ నిర్మించి తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువుల తయారీ చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ప్రస్తుతం చెత్తను రోడ్లపై వేస్తూ తగులబెట్టడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించాలని, తండాలోని రోడ్లను శుభ్రం చేసి చెత్తను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మూడు తండాల ప్రజలు కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.



## అక్రమ నిర్మాణాలపై అధికారుల కఠిన చర్యలు : డా॥ఎస్.వెంకట మణికరన్

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని అక్రమ భారీ బహుళ అంతస్తు భవనాలు అనుమతుల్లేని నిర్మాణాలపై సర్కిల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణికరణ్ ఆదేశానుసారం అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండి మైసమ్మ సర్వేనెంబర్ డి.పోచంపల్లి సర్వేనెంబర్ 168, అదే విధంగా గాగిలాపూర్ తదితర ప్రాంతాలలో వరుసగా అనుమతులు లేని అక్రమణలను తొలగిస్తున్నారు.



## మహేంద్రహిల్స్‌లో అభివృద్ధి పనులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మహేంద్రహిల్స్‌లో రూ.14. 95లక్షల వ్యయంతో కొనసాగుతున్న నిర్మాణపనులను గురువారం బిఆర్‌ఎస్ నేత మేకల రాముయాదవ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ ప్రాంతంలో 5ఎంఎల్ రిజర్వాయర్ మంజూరైందని, దీనివల్ల గౌతం నగర్ డివిజన్‌తో పాటు పరిసర ప్రాంతాలకు సైతం మంచినీటి సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణు లు బైరు అనిల్, నగేష్ గౌడ్, కావలి శీనివాస్, మల్లేష్, అనిల్, మర్రి శీను, వెంకటరమణ, శంకర్, సాయిబాబ, భరత్, తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి 15లక్షలు మోసం!

### నిందితులపై చర్యలకు బాధితుడు ఐలయ్య విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** గ్రామీణ రోజ్‌గార్ యోజనలో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికి రూ.15లక్షలు వరకు వసూలు చేసి చివరికి మోసం చేసి తప్పించుకు తిరుగుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రామగుండం, న్యూ మారేడుపాక గ్రామానికి చెందిన బాధితుడు పొలం ఐలయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తాను వికారాబాద్ జిల్లా బంట్వారం ఆరోగ్య కేంద్రంలో డిప్యూటేషన్‌తో వచ్చి హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. మేడ్చల్ జిల్లా డిఎంహెచ్‌ఒలో హెల్త్ అసిస్టెంట్ పోసాని శ్రీనివాస్ తనకు పరిచయం కాగా, ఆయనకు తెలిసిన మునగనూర్ నివాసి రాచాల రాజేందర్‌ను తన దగ్గరకు తీసుకొచ్చి గ్రామీణ రోజ్‌గార్ యోజనలో ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు ఇవ్వాలని నమ్మబలికారన్నారు. దీంతో తనకు తెలిసిన 15 మంది దగ్గర మూడు విడతలుగా రూ.5లక్షల చొప్పున రూ.15లక్షలు ఎల్‌బినగర్‌లో ఆ ఇద్దరికి అందజేశానన్నారు. ఇప్పటికీ 10 ఏళ్లు గడుస్తున్నా ఒకరికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు.దీనిపై నిలదీసి తన డబ్బులు తనకు ఇవ్వాలని అడగడంతో బెదిరిస్తున్నారని ఆరోపించారు. తనను మోసం చేసిన శ్రీనివాస్, రాజేందర్ దగ్గర నుంచి వడ్డీతో సహ రూ.15లక్షలు ఇప్పించాలని అయిలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన చెందారు. సమావేశంలో అయిలయ్య భార్య పొలం లక్ష్మి , పొలం సత్యసాగర్, అది కర్ణాకర్, మామిడి సతీశ్, తావిడి స్వాతి, పొన్నం వెంకటేశ్, మామిడి గంగారం, తావిటి రాయమల్లు, సామాజికవేత్త సునీతక్క పాల్గొన్నారు.

### జవహర్‌నగర్ డంపింగ్ యార్డు

## శాశ్వత పరిష్కారానికి సిఎంకు నివేదిక

### ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఎఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిలు వెల్లడి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దశాబ్దాల పైబడి జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య శాశ్వత పరిష్కార దిశగా సిఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తామని ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఎఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిలు వెల్లడించారు. డంపింగ్ యార్డు వల్ల ఇక్కడి ప్రజలకు ఎదురవుతున్న నష్టాన్ని, ఆరోగ్య సమస్యలను వివరిస్తామన్నారు. సిఎం ఆదేశాల మేరకు శుక్రవారం డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో వారంతా పర్యటించి క్షేత్రస్థాయి సమస్యలను అధ్యయనం చేసారు. డంపింగ్‌యార్డు సమస్య విషయమై దమ్మాయిగూడ, నాగారం, కీసర ప్రాంతాలకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇటీవల జెఎసిగా ఏర్పడి దమ్మాయిగూడ చౌరాస్తా వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఈ క్రమంలో జెఎసి నేతలు సిఎంకు సైతం వినతి పత్రం ఇచ్చారు. గతంలో నగర నలుమూలలా ఎక్కడికక్కడ డంపింగ్ యార్డులు కేటాయించినప్పటికి నిబంధనలకు విరుద్ధంగా చెత్త ఇక్కడే పడేస్తున్నారన్నారు. ప్రతిరోజు ఈ డంపింగ్ యార్డుకు 10 మెట్రిక్ టన్నుల చెత్త చేరుతోందంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుండి డంపింగ్ యార్డు విషయంలో ఒప్పందం చేసుకొన్న రాంకీ సంస్థ నిబంధనలను పాటించకపోవటం, మొదట్లో జీరో డిశ్చార్జి ఉంటుంద ని, పొల్యూషన్ ఉండదని, సౌండ్ పొల్యూషన్ ఉండదని చెప్పి వంచించిందన్నారు. ఫలితంగా 40కిమీ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలన్నీ కలుషితమై నాశనమయ్యాయన్నారు. భూగర్భ జలాలు విషతుల్యం అయ్యాయని, లక్షలాది మంది ప్రజల ఆరోగ్యం గాలిలో కల్సి పోయింద ని, గర్భిణీలు సైతం అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డు పేరిట రాంకీ సంస్థ నరరూప రాక్షసుల కంటె ఎక్కువ గా ప్రవర్తించి దగా చేస్తున్నారు. 2 దశాబ్దాల నుండి రాంకీ సంస్థ ఏక చత్రాధిపత్యం చెలాయిస్తోందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా డంపింగ్ యార్డు అతి పెద్ద సమస్యగా తయారైందన్నారు. ఇక్కడి ప్రజలు కడుహీనంగా బతుకుతున్నారని, ఆరోగ్య, శారీరక సమస్యలు పెరిగి పోవటం, చివరికి వారి శరీరాలపై ఉన్న వెంట్రుకలు సైతం ఊడి పోవటం జరుగుతోందన్నారు.

మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ సిఎం ఆదేశాల మేరకు 2 దశాబ్దాల పైబడి డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం అందించే లక్ష్యంగా సైటును క్షుణ్ణంగా పరిశీలించి, రాంకీ సంస్థ ప్రతినిధులతో మాట్లాడదామన్నారు. సంస్థ ఏ మేరకు అగ్రిమెంట్ ప్రకారం నిబంధనలను పాటిస్తోందన్న విషయాన్ని పరిశీలించి సిఎంకు నివేదిక అందచేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, కీసర డిసి వసంత, జెఎసి నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎంఎంసిలో 'జనని యాత్ర' హెల్త్ క్యాంప్ నిర్వహణ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలకు నాణ్యమైన సంతాన సాఫల్య వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 'జనని యాత్ర' పేరుతో ఉచిత సంతాన సాఫల్య చికిత్స శిబిరం నిర్వహించారు. యుసిడి విభాగం ఆధ్వర్యంలో, ఒయాసిస్ ఐవిఎఫ్, ఫెర్టిలిటీ సహకారంతో శుక్రవారం తార్నాకలోని ఎంఎంసి కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

జనని యాత్ర బస్సును యుబిడి డైరెక్టర్ సునంద రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా దంపతులకు ఉచిత ఫెర్టిలిటీ స్క్రీనింగ్‌లు, నిపుణుల వైద్యుల సలహాలు, ఆధునిక సంతాన సాఫల్య చికిత్సలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎఎమ్‌హెచ్ టెస్టులు, ఫెర్టిలిటీ అంచనా పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలతో పాటు అర్హులైన వారికి ఉచిత ఐయుఐ సేవలు అందించారు.


గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలను వారి వద్దకే తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులకు సరైన అవగాహన, సమయానుకూల వైద్యం, మానసిక ధైర్యం ఎంతో అవసరమన్నారు. ప్రతి కుటుంబం తల్లిదండ్రుల ఆనందా న్ని అనుభవించాలనే సంకల్పంతో జనని యాత్ర కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇఇ రోహిణి, ఎల్‌ఎఒ సరిత, ఒఎస్‌డి వసంత, పిడి యుసిడి సురేష్, యుసిడి సిబ్బంది భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## అనాధ గిరిజన చిన్నారులకు అండగా 'సిఎం ప్రజావాణి'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తల్లిదండ్రులు చనిపోయి అనాధలుగా మారిన ఇద్దరు గిరిజన చిన్నారులకు సిఎం ప్రజావాణి అండగా నిలిచింది. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన 'సిఎం ప్రజావాణి' ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఏజెన్సీ ప్రాంతానికి చెందిన అనాధ పిల్లలను వారి బంధువులు తీసుకొచ్చారు. రెండేళ్లు, మూడు నెలల చిన్నారుల పోషణ కష్టంగా ఉందని, వారి సంరక్షణ చూస్తున్న పెద్దనాన్న, పెద్దమ్మ ఆత్రం సునీత, వెంకటిలు సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ చిన్నారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపైన ఆయన స్పందిస్తూ ఆ ఇద్దరు చిన్నారులకు స్పాన్సర్‌షిప్ అందించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ప్రతినెల ఆర్థిక సాయంతో పాటు డబ్బా పాలను కూడా ఆ చిన్నారులకు అందించే బాధ్యత తీసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్‌కు చిన్నారెడ్డి సూచించారు.

**సీఎం ప్రజావాణిలో 396 దరఖాస్తులు...** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 224వ సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 396 దరఖాస్తులు అందాయి. ఇందులో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 163, రెవెన్యూ శాఖకు సంబంధించి 47, ఇందిరమ్మ ఇండ్ల కోసం 113, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి.




## ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి




**ప్రజాపక్షం/వికారాబాద్:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు.



గతంలో కంటే రెట్టింపు రుణాలను ప్రజాప్రభుత్వం మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ఇంటి యాజమానికి 5లక్షల రూపాయలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ చేయడం జరుగుతుందని , జిల్లాలో ఆత్మ కమిటీలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరిగి మండలంలోని రైతు విజ్ఞాన కేంద్రం మంజూరు అయ్యిందని దీనికి సంబంధించిన మిట్టకోడురులో 40ఎకరాలు స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరారు. 400 కెవి సబ్ స్టేషన్‌కు 84ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లయితే పనులు చేపట్టవచ్చని ఆయన తెలిపారు. మిషన్ బగీరథ మంచినీరు అందని ప్రాంతాలను గుర్తించి బోర్లనువేసి నీటికొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. అటవీ పందుల కారణంగా పంటలు నష్ట పోతున్నాయనే ఉద్దేశంతో పంటపొలాలకు విద్యుత్ కంచలు ఏర్పాటుచేయడం వల్ల ప్రాణాలు పోతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలను ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచిం చారు. జిల్లాలో సాగనీరు తాగునీరు అందించే విధంగా 10వేల కోట్ల అంచనాలతో 208 సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి భూ సేకరణకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. 6 లైన్లతో కూడిన 35వేల కోట్ల వ్యయంతో చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డుకు భూసేకరణ పనులు చేపట్టాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే దేశాభివద్ధి అన్నారు. చిత్త శుద్ధి, శ్రద్ధ, అంకితభావంతో అధికారులు పనిచేసినట్లయితే ప్రభుత్వ పథకా లు ప్రజలకు అందించడంలో విజయవంతం అవుతామన్నారు. జిల్లాలో రైతు భరోసా, రైతుభీమ పథకాలను సమర్థవంతంగా చేపడుతున్నామన్నారు. రైతు భరోసాకింద ఇప్పటివరకు 2,82,509 మంది రైతులు మూడు సీజన్లకు 1,114,25 కోట్ల రూపాయల ప్రయోజనం పొందారని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడం జరుగుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి స్నేహమెహ్రా, జిల్లా అదనపు కలెక్టర్లు ఉమాశంకర్‌ప్రసాద్, వెంకటచారి, జెడ్పి సిఇఒ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు పెద్ద పీట

### కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అంతాయిపల్లి ఎఎన్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సాధికారిత, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పథకాలు రూపొందిస్తోందన్నారు. పేదరికం, నిరుద్యోగం వంటి అవరోధాలను అధిగమిస్తూ అన్నిరంగాల్లో మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తోందన్నారు. మరోవైపు రైతు భరోసా, రైతు రుణ మాఫీ, ధాన్యం కొనగోలు విషయంలో ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ తరపున ఒక్కొక్కరికి రూ.75 వేల చెక్కును ట్రాన్స్‌జండర్లకు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## సమ్మర్ క్యాంప్ గ్రౌండ్‌లలో క్లీనింగ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమ్మర్ క్యాంప్ గ్రౌండ్‌లలో క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. దీంతోపాటు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో టూరిజం శాఖచే పురాతన కట్టడంగా గుర్తింపు లభించిన కీసరగట్ట ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు.



## రెచ్చిపోయిన బంగారం వ్యాపారులు

* ఫోటోలు తీయడానికి వెళ్ళిన రిపోర్టర్ నిర్బంధం
* పోలీసులకు ఫిర్యాదు చేసిన విలేకరులు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో బంగారం వ్యాపారులు రెచ్చిపోయారు. ఏకంగా బంగారం షాపుల ఫోటోలు తీయడానికి వెళ్ళిన ఓ విలేకరిని బెదరించడంతో పాటు అరగంట పాటు బంగారం షాపులో నిర్బంధించిన ఘటన చర్చనీయాశంగా మారింది. అయితే తాండూరు పట్టణంలోని స్వర్ణకారుల సంఘం, జువెలరీ వ్యాపారుల యూనియన్ల ఆధ్వర్యంలో బంగారం స్వచ్ఛతకు సంబంధించిన పరీక్షలు నిర్వహించే షాపులు కొనసాగుతున్నాయి. అయితే ఈ దుకాణాలను ప్రధాన రోడ్డు మార్గంలో కాకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లోని లోపలి భాగంలో గుట్టుగా నిర్వహిస్తున్నారు. దుకాణాల నిర్వహణకు అనుమతులు లేకపోవడంతో ఇందులో మోసాలు జరుగుతున్నాయని తెలిసిన ఓ పత్రికా విలేకరి మహేష్‌కుమార్ శుక్రవారం దుకాణాలకు సంబంధించిన పోటోలు తీయడానికి వెళ్ళారు. అక్కడ ఉన్న నిర్వాహకులు విలేకరిని అడ్డుకుని ఫోటోలు డిలీట్ చేయాలని ఒత్తిడి తీసుకువచ్చారు. అక్కడితో ఆగకుండా యూనియన్ నేతల వద్దకు వెంట తీసుకువెళ్ళారు. అక్కడ ఆ విలేకరిని నిర్భంధించి నీకు ఏ అధికారం ఉందని, ఎలా ఫోటోలు తీస్తావని విలేకరి మహేష్‌పై తీవ్రంగా హెచ్చరించారు. అరగంట పాటు నిర్బంధించిన వ్యాపారులు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వదిలి పెట్టారు. వ్యాపారులు సైతం పోలీసు స్టేషన్‌కు వెళ్ళారు. కాగా బాధిత విలేకరి మహేష్ కడా పోలీసు స్టేషన్‌కు వెళ్ళి తనను నిర్బంధించిన వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై అకారణంగా అగౌరవపర్చే విధంగా నిర్బంధించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశశారు.



## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మౌలాలి డివిజన్ జవహర్‌నగర్ ఫస్ట్‌లైన్ ప్రాంతంలో రూ. 16 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం డివిజన్ కాంగ్రెస్ నేతలు వినోద్ యాదవ్, వెంకన్న, అరుణ్‌గౌడ్, శ్రీనివాస్, ఫారుక్, మల్లేష్, భాస్యర్, చందు, యూసూఫ్, శశాంక్‌గౌడ్, రోజమ్మ, అజయ్, మధు, లక్ష్మ ణ్ ఈ ప్రాంతాన్ని సందర్శించి నిర్ణీత కాలవ్యవధిలో పనులు నాణ్యతాయుక్తంగా పూర్తి చేయాలని కోరారు.

## సిఎంకు ఆర్‌ఎస్ ప్రవీణ్ క్షమాపణలు చెప్పాలి

### కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్ మాదిగ డిమాండ్

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** బండి భగీరథ్ పోక్సో కేసు విషయమై సిఎం రేవంత్ రెడ్డిని, పోలీసు యంత్రాంగాన్ని అవమానపరుస్తూ మాట్లాడుతున్న రిటైర్డ్ ఐపిఎస్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఆయన మీడియతో మాట్లాడారు. భగీరథ్ కేసు విషయంలో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీస్ యంత్రాంగం పట్ల ప్రజల్లో చులకన భావం కలిగేలా ఆయన మాటలు ఉన్నాయని ధ్వజమెత్తారు. తప్పు చేస్తే ఎంతటి వారినైనా ప్రభుత్వం వదిలిపెట్టబోదనడానికి బండి భగీరథ్ అరెస్టే నిదర్శనమన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కు, బిఆర్‌ఎస్‌కు దొంగలకు లేదన్నారు. ఫామ్‌హౌజ్‌లో పడుకున్న కాపలా కుక్కను, కాపు కాస్తున్న మాజీ పోలీస్ కుక్కను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నా రు.



